


వేరుశనగ ఆకులపై మంచు బిందువులు | కర్బూజ పంటను కమ్మేసిన పొగమంచు

పచ్చ పచ్చని పైరు..! పసుపు పచ్చని కర్బూజ పండ్లు..! ఎర్రటి టమోటాలు..! ఇంకా ఎన్నెన్నో..! ప్రకృతి మాతకు ధూపం పట్టి ఆరాధిస్తున్నట్లు.. పొగ మంచు..! పొలం గట్టుపై నిలబడి చూస్తే.. చాలా అందంగా కనిపిస్తుంది. ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇది ఒక కోణం. అన్నదాతల శ్రమను అమాంతం మింగేస్తుంది ఈ పొగ భూతం. ఇది మరో కోణం. చలి కాలం సమీపించే కొద్దీ జిల్లా వ్యాప్తంగా పొగ మంచు అలుముకోవడం పెరుగుతోంది. దీంతో పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు దట్టమైన పొగమంచు అలుముకుంటోంది. ఆకులపై నీటి బిందువులు పడుతున్నాయి. తేమ కారణంగా దిగుబడులు పాడైపోతున్నాయి.

- కళ్యాణదుర్గం, ఆంధ్రజ్యోతి

పొగ మంచు

- పంటలకు బూడిద, ఆకుముడత తెగుళ్లు
- మందులు పిచికారీ చేసినా నిష్ప్రయోజనం
- కర్బూజ, కళింగర, టమోటాకు భారీగా నష్టం

తోట పంటలకు దెబ్బ

కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో సుమారు 700 ఎకరాలో కర్బూజ, కళింగర, టమోటా పంటలు సాగయ్యాయి. ఇవి కాకుండా వేరుశనగ, మొక్కజొన్న, బొప్పాయి, కంది, మిరప, బీరకాయి, వంకాయ, గుమ్మడి తదితర పంటలను వందలాది ఎకరాల్లో సాగు చేశారు. సాగు చేసిన తొలి 20 రోజులు పంట బాగానే ఉన్నా, ప్రస్తుతం పొగ మంచు కారణంగా దెబ్బతింటున్నాయి. మంచు కారణంగా బూడిద, ఆకుముడత తెగుళ్ల సోకుతున్నాయి. పంట పెరుగుదల ఆగిపోతోంది. పూత రాలిపోతోంది. ఈ ప్రభావం దిగుబడిపై పడుతోంది. తెగుళ్ల నివారణ కోసం ఎకరానికి రూ.5 వేల వరకు వెచ్చించి మందులను పిచికారీ చేయిస్తున్నారు. అయినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. కర్బూజ, కళింగర, టమోటా పంటలకు ఎక్కువ నష్టం జరుగుతోంది. రూ.లక్షలు పెట్టి పంటను సాగు చేశామని.. పొగ మంచుతో పెట్టుబడి కూడా నష్టపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



ముంచేస్తోంది..

రెండు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను. పొగమంచుతో పూతంతా రాలిపోయింది. పంట ఎదుగుదల లేదు. వాతావరణం అనుకూలిస్తేనే గట్టెక్కేది.

- రామాంజి, మేళ్లకుంట

తంటాలు పడుతున్నాం..



నాలుగు ఎకరాలలో వేరుశనగ పంటను సాగు చేశాను. పొగమంచుతో తెగుళ్ల సోకుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నాం. బూడిద తెగులు, ఆకుముడతను అరికట్టేందుకు వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారీ చేస్తున్నాను. అయినా ప్రయోజనం కనిపించడం లేదు.

- హనుమంతరాయుడు, జెల్లిపల్లి

ఇలాగే ఉంటే కష్టమే..



వాణిజ్య పంటలకు తెగుళ్ల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఈసారి వేరుశనగ పంట సాగు చేశాను. రెండు ఎకరాలలో పంట ఏపుగా పెరుగుతోంది. ఈ ఏడాది కష్టాలు తీరుతాయని అనుకున్నాను. పొగమంచు కమ్మేసి పూత రాలిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే దిగుబడి తగ్గిపోతుంది.

- జి.రామాంజి, రైతు, కంబదూరు



కర్బూజ ఎదగడం లేదు

రెండు ఎకరాలలో రూ.రెండు లక్షలు ఖర్చుచేసి నెల క్రితం కర్బూజ పంటను సాగు చేశాను. పొగమంచు కారణంగా ఏ మాత్రం ఎదగడం లేదు. కర్బూజ ఆకులపై మంచు బిందువులు చేరడంతో తెగుళ్ల బెడద ఎక్కువైంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. తీవ్రంగా నష్టపోతున్నాను.

-రవీంద్ర, ఒంటారెడ్డిపల్లి



ఇంకా మొగ్గ దశలో..

పొగమంచు కారణంగా కర్బూజ పంట దెబ్బతింటోంది. రోజూ తెల్లవారుజామున, సాయంత్రం మంచు కురుస్తోంది. పంట ఎదుగుదలకు అడ్డంకిగా మారింది. పంట సాగు చేసి 20 రోజులవుతున్నా మొగ్గ దశలోనే ఉంది. మారిన వాతావరణం కారణంగా తెగుళ్ల సోకుతున్నాయి. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

-రామాంజి, కంబదూరు

కబ్జాదారులను ఉపేక్షించవద్దు

కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక



కలెక్టర్‌కు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పేదల భూములను కబ్జా చేస్తున్నారని ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. పట్టణంలోని టీడీడీ కల్యాణ మండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గుంతకల్లులో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో మండల కేంద్రాలలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రజల నుంచి మొత్తం 410 ఆర్జీలు వచ్చాయని, గుంతకల్లు పట్టణం, మండల ప్రజలు ఎక్కువగా ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. బాధితుల వద్దకు కలెక్టర్ నేరుగా వెళ్లి మాట్లాడారు. జేసీ శివనారాయణ శర్మ, ఆర్డీఓ ఏబీవీఎస్‌బీ శ్రీనివాస్, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, సీపీఓ అశోక్‌కుమార్, అర్ అండ్‌బీ ఎస్‌ఈ ఓబుల్‌రెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- నెలగొండ, మొలకలపెంట, నాగసముద్రం, కొంగనపల్లిలో ఫ్లోరైడ్ సమస్య ఉందని, అక్కడ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని గుంతకల్లు ఎంపీపీ మాధవి కలెక్టర్‌ను కోరారు.
- ఆలూరు రోడ్డులోని షికారి బెంచ్‌లో ఉన్న 57 సెంట్ల స్థలాన్ని గొరవ కుళ్లాయప్ప, అతని కుమారులు, అనంతపురానికి చెందిన ఇద్దరు రౌడీ షీటర్లు కబ్జా చేశారని గుంతకల్లు పట్టణానికి చెందిన వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు.
- గుంతకల్లు పట్టణంలో ఐదు సెంట్ల రిజర్వాయర్ స్థలం, ఎర్రతిమ్మచెరువు స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని టీడీపీ మాజీ కౌన్సిలర్ కోడెల చంద్రశేఖర్ కోరారు. దోనిముక్కల రోడ్డులో పాలిటెక్నిక్ కళాశాలకు ఇచ్చిన స్థలంలో మట్టిని తరలించడంతో గుంతలు పడ్డాయని, మరోక చోట పాలిటెక్నిక్ కళాశాల భవనాలను నిర్మించాలని ఆయన కలెక్టర్‌కు ఆర్జీ ఇచ్చారు. టీడీపీ హయాంలో టిడ్కో అపార్ట్‌మెంట్ కోసం లబ్ధిదారులు కట్టిన డబ్బును వెనక్కి ఇప్పించాలని మాజీ కౌన్సిలర్ అంజి కోరారు. అంబేడ్కర్ భవనానికి నిధులు కేటాయించాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జింకల జగన్నాథ్ కోరారు.
- పట్టణంలో ఒంటరి మహిళలకు తెల్లరేషన్‌కార్డు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డె రమేష్ ఆర్జీ ఇచ్చారు.
- పట్టణంలోని అల్లీపీరా కాలనీలో 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి విన్నవించారు. గ్రామ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు కోరారు. రాగులపాడు వద్ద తూము ఏర్పాటు చేసి పిల్ల కాలువల ద్వారా గుంతకల్లు, పామిడి గ్రామాలకు నీరు ఇవ్వాలని సీపీఐ మండల నాయకులు రాము, ఈశ్వరయ్య కోరారు.

తిరగబడండి: ఎమ్మెల్యే

దోనిముక్కల రోడ్డులో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను కబ్జా చేయడానికి వచ్చేవారిపై బాధితులు తిరగబడాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని ఆయన కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, దోనిముక్కలలో రోడ్డులో ప్రభుత్వ ఇచ్చిన ఇంటి స్థలాలను కొందరు బోగస్ పట్టాలతో కబ్జా చేస్తున్నారని అన్నారు. విచారించి పేదలకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు. గుంతకల్లును దత్తత తీసుకోవాలని, నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరామని అన్నారు. దోనిముక్కల రోడ్డులో కబ్జాలకు పాల్పడుతున్న వారు తమ పేరును వాడుకోవడం చాలా పెద్ద తప్పు అని అన్నారు.

శ్మశానం.. అదే వివాదం

దళితుడి అంత్యక్రియలకు అడ్డంకి

అధికారుల జోక్యంతో తాత్కాలిక పరిష్కారం



దళిత కాలనీలో బైఠాయించిన ఎస్సీలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసంపల్లిలో ఎస్సీల శ్మశాన వాటిక సమస్య కొనసాగుతోంది. దళితులు మృతిచెందిన ప్రతిసారీ ఖననానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం శ్మశానానికి కేటాయించిన స్థలం తమదని గ్రామానికి చెంది న శంకరనారాయణ కుటుంబ స భ్యులు వాదిస్తున్నారు. ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. దీంతో శనివారం రాత్రి మృతిచెందిన దళితుడు నరసింహులుకు అంత్యక్రియలను నిర్వహించేందుకు అడ్డంకులు ఎదురయ్యా యి. రెండు రోజులపాటు సమస్య పరిష్కారం కాకపోవడంతో దళితులు రెవెన్యూ, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు గ్రామంలో సోమవారం నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు సురేశ్ కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో గ్రా మానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. దళితుల శ్మశానికి ప్రభుత్వం కేటాయించిన 1.39 ఎకరాలు కబ్జాకు గురైనా ఎందుకు పట్టించుకోవడం లేదని జేఏసీ నాయకులు నిలదీశారు. ఏడేళ్ల నుంచి సమస్య కొనసాగుతోందని జేఏసీ నాయకులు సాకే హరి, లోచర్ల నరసింహులు, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, మల్లికార్జున తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే మృతదేహంతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో ధర్మవరం ఆర్డీఓ మహేశ్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీధర్ గ్రామానికి చేరుకుని ఇ రువర్గాలతో చర్చించారు. శ్మశాన వాటికు ప్రభుత్వం స్థలం కేటాయించినందున అడ్డుకోవద్దని వైసీపీ వర్గీయులైన శంకరనారాయణ కుటుంబ సభ్యులకు సూచించారు. దీంతో ఈ సమస్యపై తాము కోర్టుకు వెళ్లామని వారు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు తీర్పును ఇరువర్గాలు శిరసావహించాలని, ప్రస్తుతం అంత్యక్రియలకు సహకరించాలని అధికారులు సూచించారు. అధికారులు దగ్గరుండి అంత్యక్రియలను పూర్తి చేయించారు. అనంతరం శ్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేయించారు.

ప్రజల భద్రత మా కర్తవ్యం: ఎస్పీ



రక్తదాన శిబిరంలో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత తమ కర్తవ్యమని ఎస్పీ జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా డీపీఓ ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవచ్చని అన్నారు. సీఐలు ధరణి కిషోర్, క్రాంతికుమార్, శ్రీకాంత్, కనుమూరి సాయినాథ్, రఘుప్రసాద్, ఆర్‌ఐ రెడ్డప్ప, సివిల్, ఏఆర్, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డుల సహా 162 మంది రక్తదానం చేశారు. ఏఎస్పీ రమణమూర్తి, రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ వెంకటేష్ ప్రసాద్, సర్వజన ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కిశోర్, డాక్టర్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ఏడాది కాలంలో విధి నిర్వహణలో మృతి చెందిన 11 మంది పోలీసులు, హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ రూ.2.30 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు.




కుటుంబ సభ్యులతో జస్టిస్ చల్లా గుణరంజన్, ప్రమాణస్వీకారం చేస్తూ...

హైకోర్టు జడ్జిగా జస్టిస్ గుణరంజన్ ప్రమాణ స్వీకారం

తాడిపత్రి ప్రాంతంలో హర్షాతిరేకాలు

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లవారిపల్లి గ్రామానికి చెందిన జస్టిస్ చల్లా గుణరంజన్ ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే చల్లా సుబ్బరాయుడు తమ్ముడు చల్లా నారాయణ, చంద్రమ్మ దంపతుల కుమారుడు. జస్టిస్ చల్లా గుణరంజన్ సోదరుడు చల్లా నాగేంద్రప్రసాద్ ఆదాయ పన్నుశాఖ ట్రిబ్యునల్ మెంబరుగా వ్యవహరిస్తున్నారు. చల్లా నారాయణ న్యాయవాదిగా పనిచేసేవారు. జస్టిస్ గుణరంజన్ ఏపీ హైకోర్టు జడ్జిగా ప్రమాణస్వీకారం నేపథ్యంలో తాడిపత్రి ప్రాంత ప్రజలు, చల్లవారిపల్లి గ్రామస్థులు పెద్దఎత్తున అమరావతికి వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తాడిపత్రి వాసి రాష్ట్ర అత్యున్నతన్యాయస్థానం జడ్జి కావడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

వాన దెబ్బ



బొమ్మనహాళ్ మండలంలో మొక్కజొన్న పంటను ఇటీవల ముంచెత్తిన వరద నీరు

జిల్లావ్యాప్తంగా గత వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం తీవ్రంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 591.38 హెక్టార్లల్లో రూ.3.96 కోట్ల పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపారు. క్షేత్ర స్థాయిలో లోతుగా పరిశీలిస్తే పంటనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోతకొచ్చిన మిరప, పత్తి, ఇతర రకాల పంటలు భారీ వర్షానికి దెబ్బతిన్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

- అనంతపురం అర్బన్/పామిడి/బొమ్మనహాళ్ (ఆంధ్రజ్యోతి)

- భారీ వర్షానికి తీవ్ర పంటనష్టం
- 591.38 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికలు
- నష్టపరిహారం కోసం అన్నదాతల వేడుకోలు

134.46 హెక్టార్లలో ఉద్యాన పంటల నష్టం

భారీ వర్షాలకు జిల్లాలోని 15 మండలాల్లో 119 మంది రైతులకు చెందిన 134.46 హెక్టార్లల్లో రూ.1.30 కోట్ల విలువైన ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం, కూడేరు, పామిడి, కంబదూరు, శెట్టూరు, రాప్తాడు, ఆత్మకూరు, నార్పల, బెళుగుప్ప మండలాల్లో మిరప, టమోటా, వంకాయ, దానిమ్మ, కాకర, చీనీ, కర్బూజ, ద్రాక్ష, అరటి, మామిడి, ఉసిరి, బీర పంటలు దెబ్బతిన్నాయి.



పామిడి మండలంలో వానకు తడిసిన పత్తిని ఆరబెట్టిన రైతులు

వ్యవసాయశాఖలో రూ. 2.66 కోట్ల పంటనష్టం

వ్యవసాయ శాఖ పరంగా జిల్లాలోని 14 మండలాల్లో 481 మంది రైతులకు చెందిన 456.92 హెక్టార్లల్లో రూ.2.66 కోట్ల పంట నష్టం జరిగింది. అనంతపురం, గార్లదిన్నె, కణేకల్లు, నార్పల, గుమ్మగట్ట, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల, పెద్దవడుగూరు మండలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.



దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

మిరప దెబ్బతింది



ఏడెకరాల్లో ఎండు మిరప పంట సాగు చేశా. ఇందులో 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పంట పెట్టా. మరో ఎకరాలో పచ్చిమిరప సాగు చేశా. ఎండు మిరప పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో పూర్తిగా దెబ్బతింది. చెట్లపై ఎండు మిరప కాయలు బూజుపట్టి కుళ్లిపోతున్నాయి. తద్వారా రూ.5 లక్షలకుపైగా నష్టం వచ్చింది. పచ్చి మిరప కోత దశలో ఉన్నప్పుడు వర్షం పడటంతో పూర్తిగా దెబ్బతింది.

- విజయభాస్కర్‌రెడ్డి, అనుంపల్లి, పామిడి మండలం

ఉద్యాన పంటల నష్టం వివరాలు...

పంట	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
మిరప	73.80	64.41
టమోటా	27.20	21.76
కాకర	0.80	0.48
ద్రాక్ష	2.00	4.00
చీనీ	8.40	9.64
అరటి	6.60	16.50
దానిమ్మ	2.00	2.40
ఉసిరి	2.00	1.60
మామిడి	4.00	4.00
కర్బూజ	6.00	4.80
వంకాయ	1.00	0.60
బీర కాయ	0.66	0.40
మొత్తం	134.46	రూ.1.30 కోట్లు

వ్యవసాయ శాఖ పరంగా పంటనష్టం వివరాలు

పంట రకం	విస్తీర్ణం (హెక్టార్లల్లో)	పంటనష్టం (లక్షల్లో)
వరి	273.1	156.65
పత్తి	11.0	5.48
మొక్కజొన్న	111.8	75.29
జొన్న	11.0	6.05
వేరుశనగ	48.0	22.26
నువ్వులు	2.0	0.3
మొత్తం	456.92	రూ.2.66 కోట్లు

పంట తడిసిపోయింది..



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. పంట మొదటి కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షం పడటంతో పత్తి దెబ్బతింది. వానకు పత్తి పంట పూర్తిగా తడిసిపోయింది. ఇప్పటి దాకా ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టా. వానకు తడిసిన పత్తిని వదిలేయలేక తొలగించి ఇంట్లో ఆరబెట్టుకున్నా. పత్తి రంగు మారడంతో వ్యాపారులు కొంటారో లేదో అర్థం కావడం లేదు. భారీ వర్షానికి పత్తి పంటను గులాబీ పురుగు ఎక్కువగా ఆశిస్తోంది. దీనికి మందులు పిచికారి చేయాలంటే అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సిందే. వ్యవసాయ అధికారులు పత్తి పంట దెబ్బతిన్నట్లు రాసుకొని వెళ్లారు. పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

-రామలింగారెడ్డి, గజరాంపల్లి, పామిడి మండలం

పంటంతా మునిగిపోయింది



వరద నీటిలో పంటంతా మునిగిపోయింది. రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మరో రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. కోతకువచ్చిన సమయంలో భారీ వర్షం రావడంతో వేదావతి, హగరి నది నుంచి వచ్చిన వరద నీరు మొక్కజొన్న, పత్తి పంటను ముంచేసింది. దీంతో మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలుగు ఎకరాల్లో రెండు పంటల సాగు కోసం రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికే పంటల సాగు కోసం రూ.6 లక్షలు అప్పు చేశా. ఈ సారి పంట చేతికొచ్చి ఉంటే రూ.4లక్షలదాకా అప్పు తీరేది. వరదనీటితో పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

-ఆంజనేయులు, ఏలంజి, బొమ్మనహాళ్ మండలం

న్యూస్‌బాక్స్

డీఆర్‌ఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మలోల

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ ఆఫీసర్(డీఆర్ఓ)గా మలోల బాధ్యతలు స్వీకరించారు. జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న మలోలను జిల్లా డీఆర్‌ఓగా ప్రభుత్వం నియమించింది. నూతన డీఆర్‌ఓ మలోల సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఉదయమే కలెక్టరు వినోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రస్తుతం బదిలీ అయిన డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. నూతన డీఆర్‌ఓకు కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పలువురు ఆర్డీఓలు, తహసీల్దార్లు అభినందనలు తెలిపారు.

చెస్‌లో చిన్నారి ప్రతిభ

- ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన శమిక



సాధించిన పతకాలతో కాశి శమిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కాశి శమిక చెస్‌లో అద్భుత ప్రతిభ చూపి ఒకేసారి మూడు పతకాలు సొంతం చేసుకుంది. విజయవాడలో ఈనెల 22 నుంచి 27 వరకు బీఎన్‌కే ఫౌండేషన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్, అఖిల భారత చదరంగస మాఖ్య, ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ ప్రథమ ఇంటర్నేషనల్ ఫిడే చెస్ ఫెస్టివల్-2024ను నిర్వహించారు. ఇందులో వివిధ దేశాల నుంచి సుమారు 1500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి కాశి శమిక క్లాసికల్ అండర్-7 బాలికల విభాగంలో ఐదో స్థానం, ర్యాపిడ్‌లో నాలుగో స్థానం, బ్లిట్జ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. ఒకే సమయంలో మూడు పతకాలు సాధించిన క్రీడాకారిణి శమికను కోచ్‌లు ఉదయ్‌కుమార్ నాయుడు, గోవింద రాజులు అభినందించారు.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13పలికినట్లు ఆయన తెలిపారు.

భారీగా టపాసుల స్వాధీనం



ఐషర్ వాహనంలోకి లోడ్ చేస్తున్న టపాసులు

యల్లనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో అనుమతులు లేకుండా భారీమొత్తంలో నిల్వ ఉంచిన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ సత్యబాబు, ఎస్ఐ రాంప్రసాద్ సోమవారం ఉదయం 8గంటల సమయంలో గిర్రమ్మబావి సమీపంలోని గృహాల్లో సోదాలు నిర్వహించారు. ఒక ఇంటిలో భారీగా నిల్వ ఉంచిన టపాసులను చూసి అధికారులు అవాక్కయ్యారు. ఇంటి యజమానిని పిలిపించి వాటి గురించి ఆరాతీశారు. తాడిపత్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు తరచూ ఇక్కడ టపాసులు నిల్వ ఉంచుకొనే వారని విచారణలో తేలింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి వెంటనే అక్కడ ఉన్న టపాసులను ఒక ఐషర్, నాలుగు చిన్న వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. మూడు వాహనాల్లో సరుకు స్టేషన్‌లో ఉంచగా, మిగిలిన రెండు వాహనాల సరుకును స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రైవేట్ రూంలో ఉంచారు. వీటివిలువ సుమారు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల దాకా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

● కాగా పోలీసులు స్వాధీనం చేసుకున్న టపాసులను వాహనాల్లో తీసుకువచ్చి ప్రైవేట్ రూములో ఉంచడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. సీజ్‌చేసిన చోట నుంచి సురక్షితమైన ప్రాంతానికి తరలించకుండా, నివాస ప్రాంతాల్లో ఎందుకు తీసుకువచ్చి ఉంచారో అని చర్చించుకుంటున్నారు.

రూ.11వేల టపాసులు సీజ్

తాడిపత్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలోని ఒక దుకాణంలో సోమవారం రూ.11వేలు విలువగల టపాసులు సీజ్‌చేసినట్లు ఏఎస్ఐ నాగన్న తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేయగా దుకాణంలో విక్రయాలు జరుపుతున్నాడని తెలిసి వాటిని సీజ్ చేశామన్నారు. విక్రయాలు జరుపుతున్న రాజగోపాల్‌ను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

70 తులాల వెండి నగల అపహరణ



ఆభరణాలులేని అమ్మవారి విగ్రహం

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొట్టాల గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామ పెద్దలు తెలిపిన మేరకు 2024 ఫిబ్రవరిలో పెద్దమ్మ ఆలయాన్ని నిర్మించి, నూతన విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో అనేక మంది అమ్మవారికి వెండి ఆభరణాలు సమర్పించారన్నారు. వాటిని తరచూ అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటిలాగే శనివారం కూడా అమ్మవారికి వెండి కిరీటం, వెండి నగలు, ముక్కుపుడక, తాళిపైను తదితర ఆభరణాలు అలంకరించి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి వరకూ ఆలయంలో పూజలు, భజనలు నిర్వహించి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తిరిగి సోమవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు ఆలయానికి వెళ్లగా బయటి వాకిలి(తలుపులు)కి ఉన్న తాళం కనిపించలేదన్నారు. ఇనుప వాకిలి వంగిపోయి, సిమెంట్ పెచ్చులు ఊడిపోవటంతో అనుమానం వచ్చి గుడిలోకి వెళ్లి చూడగా అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం, నగలు దాదాపు 70 తులాలు కనిపించలేదని తెలిపారు. చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చి విడపనకల్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

జీడిపల్లిలో 1.681 టీఎంసీల నీరు

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో సోమవారం 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1141 క్యూసెక్కులు వుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,101 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అమిలినేని



మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం మహిళా సంఘాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల వారు తయారుచేసిన వివిధ రకాల వస్తువుల విక్రయం, అర్బన్ మార్కెట్‌ను ఆయన టీడీపీ పరిశీలకుడు నాగేశ్వరరావుతో కలిసి సోమవారం టీ సర్కిల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు తీసుకుని చేతివృత్తులు, ఇతర వ్యాపారాలు చేస్తున్న మహిళల వద్ద నాణ్యమైన వస్తువులు ఉంటాయన్నారు. వారి వద్ద వస్తువులు కొనుగోలు చేయడం ద్వారా వారిని మనం ఆర్థికంగా ఆదుకోవచ్చన్నారు. పార్టీ పరిశీలకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కార్యకర్తల కుటుంబాల ఇబ్బందులు పడకూడదని బీమా అందిస్తున్న పార్టీ టీడీపీ మాత్రమేనన్నారు. సభ్యత్వ నమోదులో కళ్యాణదుర్గం ఐదో స్థానంలో ఉందని, 50 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేసి మొదటి స్థానంలో నిలబడేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

జిల్లా హాకీ జట్టుకు పాల్తూరు విద్యార్థులు

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 14మంది ఎస్‌జీఎఫ్ హాకీ జిల్లా జట్టుకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 23న అనంతపురంలో ఎస్‌జీఎఫ్ వారు నిర్వహించిన హాకీ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక అయ్యారన్నారు. అండర్- 17 విభాగంలో పి.నందు, పి.కుమార్ స్వామి, సి.పృథ్వీ జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో శశికళ, ప్రియాంక, జుబేదా భాను ఎంపికైనట్లు వెల్లడించారు. అండర్-14 విభాగంలో బాలురు వనేష్, సుధీర్, బాలరాజు, మేఘనాథ్, శశికుమార్, బాలికలు బీడీ మల్లిక, మానస, ప్రియాంక ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్-17 విభాగంలో హాకీ పోటీలు నవంబరు 3 నుంచి 5వరకూ నెల్లూరులో జరుగుతాయన్నారు. అండర్-14 పోటీలు నవంబరు 8 నుంచి 10 వరకూ అనకాపల్లిలో జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.



ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థినీవిద్యార్థులు

నిజాయతీగా పనిచేద్దాం: డీఆర్‌ఎం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

గుంతకల్లు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీతో పారదర్శకంగా పని చేద్దామని రైల్వే ఉద్యోగులతో డీఆర్‌ఎం విజయకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను పురస్కరించుకుని తన కార్యాలయం బయట సోమవారం ఉదయం ఉద్యోగులను సమావేశపరిచారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, పనిలో పారదర్శకత, అవినీతి రహిత కార్యాచరణ ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జేఏ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

నలుగురు రైల్వే ఉద్యోగులకు అవార్డులు

గుంతకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైళ్ల భద్రత విషయంగా సకాలంలో స్పందించి అప్రమత్తంగా వ్యవహరించిన నలుగురు రైల్వే ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులు ప్రకటించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం జీఎం అరుణ్ కుమార్ జైన్, ఏజీఎం నీరజ్ అగర్వాల్ ఆధ్వర్యంలో దక్షిణమధ్య రైల్వే జోన్‌లోని ఆరు డివిజన్ల అధికారులతో రైళ్ల భద్రతపై ఆన్‌లైన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ వ్యాప్తంగా 15 మంది ఉద్యోగులకు ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. ఇందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని నలుగురు ఉద్యోగులు, సికింద్రాబాద్, విజయవాడ, నాందేడ్ డివిజన్‌లో ముగ్గురు చొప్పున, గుంటూరు డివిజన్‌లో ఇద్దరికి ఎంప్లాయీ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రకటించారు. కార్యక్రమంలో జోన్ పరిధిలోని ఆరు డివిజన్ల డీఆర్‌ఎంలు పాల్గొన్నారు.

మార్పే సమస్యలకు పరిష్కారం

సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

అనంతపురం కల్చరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని మార్చడమే ప్రజా సమస్యలకు అంతిమ పరిష్కారం అని మాజీ ఎమ్మెల్సీ సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంవీఎస్ శర్మ పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో 'లెనినిజం - నేటి సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహిచారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించగా, ఎంవీఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మరల్చడమే పాలకుల విధానం అన్నారు. ప్రస్తుతం దేశంలో నూతన సంస్కరణల పేరుతో అమలవుతున్న విధానాలు అదానీ, అంబానీ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు. దేశంలో కొద్దిమందిగా ఉన్న వారు అత్యధికమంది ప్రజలను కొల్లగొడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తం గా కార్మికవర్గ వేతనాలు పెరగని పరిస్థితి ఉందన్నారు. లెనినిజం ప్రభా వం ఉత్పన్నమవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్ నిరంకుశం వల్లే వైసీపీని ప్రజలు ఓడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, బాషా, డాక్టర్ వీరభద్రయ్య, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, నాగేంద్ర, లెనిన్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు అపుస్మా సాయం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ వరద బాధితుల సహాయార్థం అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపుస్మా) తరఫున ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీగా విరాళం అందించారు. అపుస్మా జిల్లా నాయకులు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు కుసుమ పుల్లారెడ్డి, నాయుడు, నాగపీరయ్య ఆ సంఘం ద్వారా అనంతపురం జిల్లా శాఖ తరపున రూ. 10 లక్షల చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తమ రాష్ట్ర అసోసియేషన్ తరపున మొత్తం రూ. 75 లక్షల చెక్కును సీఎంకు అందించినట్లు తెలిపారు. తర్వాత రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

వైఎస్‌ఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక



ఓబుళపతి



గిరిధర్ రెడ్డి

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం కొత్త అధ్యక్షుడు ఓబుళపతి సోమవారం తెలిపారు. రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నూతన కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రాజమోహన్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఓబుళపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గిరిధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సింహాద్రి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే అధికార ప్రతినిధిగా రియాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షులుగా సురేష్‌కుమార్, గంగిరెడ్డి, వెంకటరెడ్డి, కార్య దర్శులుగా మల్లయ్య, విశ్వనాథరెడ్డి, ఆదినారాయణ స్వామిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు స్పష్టం చేశారు. వారంతా రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ఆయన ప్రకటించారు.

- ఏసీలు, విలువైన ఫర్నీచర్ మాయం
- బంగ్లాలోనూ అపహరణ
- దొంగలకు సిబ్బంది సహకారం
- ఐదేళ్లూ విచ్చలవిడిగా సామగ్రి కొనుగోలు





కాన్ఫరెన్స్ హాల్‌లో ఏసీలు లేకుండా బోసిపోతున్న దృశ్యం

"జిల్లాలోని అన్నిశాఖల్లోనూ డ్వామా అంటే ప్రత్యేకత ఉంది. అది బలిష్టమైనది. నిధులు వెల్లువలా వస్తుంటాయి. ఆ శాఖలో కీలకమైన పోస్టుల కోసం వేరే శాఖల అధికారులు సైతం డెప్యుటేషన్‌పై ఇక్కడికి వస్తుంటారు. అంతటి కీలకమైన శాఖలో దొంగలు పడ్డారు. బయట వారు కాదు ఇంటి వారే. 'ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు' అంటారు. ఏసీలు, ప్రింటర్లు, ఇతర ఫర్నీచర్ కూడా ఎత్తుకెళ్లారంటే.. ఇంతకన్నా కక్కుర్తి ఉంటుందా..? వీరు అధికారులేనా..?"

ఏమిటీ కక్కుర్తి..!

డ్వామాలో దొంగలు పడ్డారు..

ఐదేళ్లలో రూ.90 లక్షల సామగ్రి కొనుగోలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో కీలకంగా ఉన్న డ్వామాలో దొంగలు పడ్డారు. ఏసీలు, విలువైన సామగ్రి మాయం చేశారు. డ్వామా కాన్ఫరెన్స్‌హాల్‌తో పాటు కార్యాలయం, పీడీ బంగ్లాలో ఉండే ఏసీలు, అత్యంత ఖరీదైన ఫర్నీచర్‌ను తీసుకెళ్లినట్లు సమాచారం. బదిలీ అయిన అధికారులు తమ సిబ్బంది సహకారంతోనే తరలించారని తెలుస్తోంది. ఐదేళ్లలో కొనుగోలు చేసిన సామగ్రికి రూ.90 లక్షల వరకు నిధులు వెచ్చించినట్లు సమాచారం. గత ఐదేళ్లు, అంతకు ముందు కొనుగోలు చేసిన మొత్తం ఏసీలు, ఫర్నీచర్ కనపడలేదు. ఎన్నో సమీక్షలు, సమావేశాలకు వేదికగా నిలిచిన డ్వామా కాన్ఫరెన్స్‌హాల్‌లో ఒక్క ఏసీ కూడా లేకుండా ఎత్తుకెళ్లారు. దీనిపై ఎవరూ నోరు మెదపడం లేదు.

కాన్ఫరెన్స్ హాలులో ఏసీలు మాయం

2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని డ్వామా కాన్ఫరెన్స్‌హాలు ఓ వెలుగు వెలిగింది. జిల్లాకు మంత్రులు, రాష్ట్ర జాతీయ స్థాయి అధికారులు ఎవరు వచ్చినా డ్వామా కాన్ఫరెన్స్‌హాల్ వేదికగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించేవారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ తరువాత మధ్యాహ్నం నుంచి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక డ్వామా కాన్ఫరెన్స్‌హాలుకు ఉన్న ప్రాధాన్యతను తగ్గిస్తూ వచ్చారు. సమీక్షలు, సమావేశాలన్నీ కలెక్టరేట్‌కే పరిమితం చేశారు. ఈ ఐదేళ్లలో కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉన్న ఏసీలు, ఇతర ఫర్నీచర్‌ను మాయం చేశారు. డ్వామా కార్యాలయంలో మొత్తం 8 ఏసీలు, రూ.10లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను బదిలీపై వెళ్లిన అధికారులు తమ వెంట తీసుకెళ్లినట్లు ఆ శాఖలో జోరుగా చర్చ సాగుతోంది. జిల్లా దాటిన, జిల్లా పరిధిలోనే బదిలీ అయిన అధికారులు గుట్టు చప్పుడు కాకుండా సామగ్రిని రాత్రికిరాత్రే తరలించినట్లు సమాచారం. డ్వామా కార్యాలయంతో పాటు పీడీ బంగ్లాలో కూడా ఏసీలు, విలువైన సామగ్రిని ఎత్తుకెళ్ళినట్లు తెలుస్తోంది. బంగ్లాల్లో ఏ ఒక్క వస్తువును తాకడానికి అధికారులకు అధికారం ఉండదు. బంగ్లాలో అన్ని ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసినవే. బదిలీ అయిన అధికారులు తమ సొంత సామగ్రిని మాత్రమే తీసుకెళ్లాలి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏసీలు, విలువైన ఫర్నీచర్‌ను తరలించినట్లు ఆశాఖలోనే చెబుతున్నారు. వీటి తరలింపులో సిబ్బంది పాత్ర కీలకంగా ఉందని తెలుస్తోంది.

డ్వామాలో గడిచిన ఐదేళ్లలో సుమారు రూ.90లక్షల వరకు వెచ్చించి సామగ్రి కొనుగోలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సామగ్రి కొనుగోలుకంటూ నిధులు డ్రా చేశారు. ఇందులో ఏమేమి కొనుగోలు చేశారనేది ఎవరికీ తెలియదు. అవసరం ఉన్నా, లేకున్నా ఇష్టానుసారంగా కొనుగోలు చేశారు. ఏసీలతో పాటు ఫర్నీచర్, కంప్యూటర్లు, ఫ్యాక్స్ మిషన్లు, ప్రింటర్లను పదికి పైగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం నాలుగైదు మాత్రమే డ్వామా కార్యాలయంలో కనిపిస్తున్నాయి. మిగిలినవి మాయం చేసేశారు.

రికార్డులను పరిశీలిస్తున్నాం



డ్వామాలో ఉన్న అన్ని రికార్డులను పరిశీలిస్తున్నాం. ఏసీలతో పాటు ఇతర సామగ్రి వివరాలు తెలుసుకుంటున్నాం. బంగ్లాలో కూడా ఏమేమి వస్తువులు ఉన్నాయి. ఇప్పుడు ఏమేమి కనబడడం లేదో అడిగి తెలుసుకుంటున్నాం. ఐదేళ్లలో ఏమేమి కొనుగోలు చేశారో...ఎంత ఖర్చు పెట్టారో చూడాలి. ఏసీలు, ఇతర ఏ సామగ్రి తరలించలేదని తెలుస్తోంది. అనవసరంగా ఒకరి మీద నింద వేయరాదు. పూర్తి వివరాలు తెలిస్తేనే మాట్లాడాలి. రికార్డులతో పాటు సీసీ కెమెరాల పుటేజీ కూడా పరిశీలిస్తాం. ఒక వేళ తేడా ఉంటే కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

- సలీంబాషా, పీడీ, డ్వామా

డాడీ.. లే.. డాడీ..





నరసింహుడు (ఫైల్), మృతదేహం వద్ద రోదిస్తున్న కుమార్తె వీణామాధురి

అప్పుల బాధ భరించలేక ముదిగుబ్బకు చెందిన నర్సరీ నిర్వాహకుడు నరసింహుడు (35) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా వేంపల్లికి చెందిన నరసింహుడు పదేళ్ల క్రితం ముదిగుబ్బకు వలస వచ్చాడు. కాశిరెడ్డి నాయన ఆశ్రమ సమీపంలో నర్సరీ ఏర్పాటు చేసుకుని, జీవించేశాడు. గతేడాది నారు అమ్ముడుపోక రూ.4 లక్షలు నష్టపోయాడు. ఈసారి అప్పులు చేసి మళ్లీ నారు వేశాడు. ఈసారి కూడా అదే పరిస్థితి ఎదురైంది. మరో రూ.4 లక్షలు నష్టం వాటిల్లింది. మొత్తంగా అప్పు రూ.8 లక్షలకు చేరింది. ఎలా తీర్చాలోనని మదనపడుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, మరణించాడు. కాసేపటికి ఇంటికొచ్చిన భార్య సుధ తలుపు తట్టగా తెరవలేదు. స్థానికుల సాయంతో తలుపు బద్దలుకొట్టి చూడగా.. నరసింహులు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో భార్య బోరున విలపించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. నరసింహులుకు ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వీణామాధురి, రెండో తరగతి చదువుతున్న కుమారుడు అరుణ్ ఉన్నారు. పాఠశాల నుంచి వచ్చిన కుమార్తె.. తండ్రి నరసింహుడు మృతదేహం పడి రోదించిన తీరు కన్నీరు పెట్టించింది. డాడీ.. లే.. డాడీ.. అంటూ ఆ చిన్నారి తల్లడిల్లింది.

> డాడీ..
> ఆనందంగా బడికి పంపావే..
> ఇందుకేనా..
> మమ్మలను వీడి పోవడానికేనా..
> అనాథలను చేసి.. వెళ్లిపోవడానికేనా..
> అల్లారు ముద్దుగా చూసుకుంది..
> అష్టకష్టాలు పడి పెంచుకుంది..
> ఇందుకేనా..
> అప్పుల సుడిగుండంలో చిక్కిన నువ్వు..
> ప్రాణాలు తీసుకుంటే..
> మేమెలా ఆనందంగా ఉంటామనుకున్నావ్..
> నువ్వేగా మా ధైర్యం..
> నువ్వేగా మా జీవితం..
> నువ్వేగా మా హీరో..
> ఎదురించి.. ఉండుంటే గెలిచేవాడివి..
> మాకు దక్కేవాడివి..
> ఎంత పనిచేశావ్.. డాడీ..
> ప్లీజ్.. లే.. డాడీ..

-ముదిగుబ్బ (ఆంధ్రజ్యోతి)

చేనేతలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చేనేత, జౌళి శాఖ ఆర్డీడీ రాజారావు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ధర్మవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళిశాఖ తిరుపతి ప్రాంతీయ ఉపసంచాలకుడు (ఆర్డీడీ) రాజారావు సూచించారు. స్థానిక తిక్కస్వామి నగర్ వార్డు సచివాలయంలో చేనేత పథకాలపై కార్మికులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ముడిసరుకుపై 5 శాతం జీఎస్టీ రాయితీ, ప్రభుత్వం అందించే త్రిఫ్ట్ ఫండ్, 100 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్ఎంఎస్ఎస్ పథకం ద్వారా 15 శాతం యార్న్ సబ్సిడీ తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ముద్ర రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధర్మవరం ప్రాంతంలో చేనేత క్లస్టర్‌ను ఏర్పాటుచేసి, కార్మికులకు జాబ్‌కార్డులు, లిఫ్టింగ్ మిషన్లు తదితర పరికరాలపై 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారన్నారు. వీటిని చేనేతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ రామకృష్ణ, నేతన్నలు పాల్గొన్నారు.

వైసీపీ బాధితులకు న్యాయం చేయండి

పథకాలు అందేలా చూడండి.. మంత్రి సవితకు పరిటాల శ్రీరామ్ వినతి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న పరిటాల శ్రీరామ్, టీడీపీ మండలాల కన్వీనర్లు

ధర్మవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపులతో కూటమి నాయకులు, సానుభూతిపరులకు ప్రభుత్వ పథకాలు అందకుండా చేసిందనీ, దీనిని సరిదిద్ది అర్హులకు న్యాయం చేయాలని చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విన్నవించారు. పెనుకొండలో మంత్రిని సోమవారం శ్రీరామ్ కలిసి, పలు సమస్యలను వివరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో కక్ష సాధింపుల్లో భాగంగా కూటమి సానుభూతిపరులకు సంబంధించిన రేషన్‌కార్డులను ఇష్టారాజ్యంగా తొలగించారనీ, దీంతో బాధితులు.. సంక్షేమ పథకాలకు దూరమయ్యాయన్నారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అందకుండా పోతున్నాయన్నారు. దీంతో అర్హులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారికి అవకాశం కల్పించి, న్యాయం చేయాలని మంత్రి దృష్టికి శ్రీరామ్ తీసుకెళ్లారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన ఎంతోమంది అనర్హులకు తెల్లరేషన్‌కార్డులు మంజూరు చేశారన్నారు. అలాంటి వాటిని తొలగించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీరామ్ వెంట ధర్మవరం, రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాలకు చెందిన టీడీపీ మండలాల కన్వీనర్లు, ముఖ్య నాయకులు ఉన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం

వైద్య విద్యార్థులు విలువలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్



మెడికోలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్, ఎస్పీ జగదీష్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన వైద్య విద్యను అభ్యసించడం అదృష్టమని, అలాంటి వృత్తిని చేపట్టబోయేవారు ర్యాగింగ్ వంటి చెడు వ్యవహారాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్ అన్నారు. ర్యాగింగ్ నేరానికి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, అందరూ స్నేహంగా మెలగాలని వైద్య విద్యార్థులకు సూచించారు. అనంత వైద్య కళాశాలలో 'ర్యాగింగ్.. దుష్ఫలితాలు' అనే అంశంపై సోమవారం వారు అవగాహన కల్పించారు. సీనియర్, జూనియర్ అనే బేధ భావన సరికాదని అన్నారు. సీనియర్ల పేరిట ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితాలు నాశనమవుతాయనిఅన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినవారు జైలు జీవితం అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విలువలు పాటిస్తేనే వైద్య వృత్తిలో గౌరవం దక్కుతుందని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, బాగా చదువుకోవాలని హితవు పలికారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్స్‌కు వారు సూచించారు.

ఇందుకు ప్రిన్సిపాల్ స్పందిస్తూ, కళాశాలలో ర్యాగింగ్ నిరోధక కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తోందని అన్నారు. ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ షారోన్ సోనియా తదితరులు పాల్గొన్నారు.

ఏమయ్యావు రామాంజినమ్మా..?

పశుసంవర్థక శాఖలో అటెండర్ అదృశ్యం

పదిరోజుల నుంచి ఆచూకీ తెలియని వైనం

ప్రాణహాని అంటూ సన్నిహితుల వద్ద ఆవేదన

ఇంటి వద్ద చెప్పులున్నా, కానరాని మనిషి



రామాంజినమ్మ(ఫైల్)

అనంతపురం క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి రామాంజినమ్మ అదృశ్యం మిస్టరీగా మారింది. ఆమె కుమార్తె అశ్విని ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. పది రోజుల కిందట ఆఫీసు పని వేళలు ముగిసిన తర్వాత ఇంటికి బయల్దేరిన ఆమె ఎక్కడికి వెళ్లినట్లు? ఇంటికే వెళ్లారా? మధ్యలో ఏదైనా జరిగిందా? అనే అనుమానాలు వెంటాడుతున్నాయి.

ఎవరీ రామాంజినమ్మ..?

సోమయ్య ఏపీఎస్పీలో కానిస్టేబుల్‌గా పనిచేసేవారు. దాదాపు 15ఏళ్ల కిందట ఆయన మృతిచెందారు. కారుణ్య నియామకం కింద ఆయన భార్య రామాంజినమ్మకు ఉద్యోగం వచ్చింది. ఆమె పశుసంవర్థక శాఖ జేడీ ఆఫీస్‌లో అటెండర్‌గా పనిచేస్తోంది. కొడుకు మోహన్‌రావుతో కలిసి నగర శివారులోని లలితానగర్‌లో నివాసముంటోంది. అక్కడి నుంచే ఆమె ప్రతి రోజు ఆఫీస్‌కు వెళ్లి వచ్చేది. కొడుకు మోహన్‌రావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి పెళ్లయింది. కోడలు కర్నూలు జిల్లా పత్తికొండలో ఉంటోంది. కుమార్తె అశ్వినికి కూడా పెళ్లయింది.

ఎలా తెలిసింది...?

రామాంజినమ్మ ఈ నెల 17న పశుసంవర్థక శాఖకు వెళ్లింది. సాయంత్రం ఇంటికెళ్లిందా..?లేదా అనే విషయంలో స్పష్టత లేదు. ఆమె ఎక్కడికీ వెళ్లదని ఇంటికే వెళ్లి ఉంటుందని బంధువులు చెబుతున్నారు. రామాంజినమ్మ కుమార్తె అశ్విని మరో ఊర్లో నివాసముంటోంది. నాలుగు రోజుల కిందట ఆమె తన తల్లికి ఫోన్ చేసింది. ఎత్తలేదు. ఎన్నిసార్లు చేసినా సమాధానం లేకపోవడంతో తల్లి ఉంటున్న ఇంటికి వచ్చి చూస్తే తాళం వేసి ఉంది. దీంతో తన అన్నకు ఫోన్ చేస్తే హైదరాబాద్‌లో ఉన్నాను...రేపు వస్తానని ఒకసారి, మరోసారి కర్నూలు ఉన్నానని మధ్యాహ్నం వస్తానని చెప్పాడే తప్ప రాలేదు. దీంతో ఆమె మూడు రోజుల కిందట అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు మోహన్‌రావును పిలిపించి విచారించారు. ఆమె అదృశ్యమైన రోజు అతడు నగరంలో లేడని తేలింది. పోలీసులు ఇంటికెళ్లి మోహన్‌రావు, అశ్విని సమక్షంలోనే తలుపులు తీయించినట్లు తెలిసింది. ఇంట్లో బీరువా తలుపులు పగలకొట్టి ఉండటం, అందులో ఉండాల్సిన బంగారం నగలు లేకపోవడం, రోకలిబండ ఎరుపు రంగు ఉండటం, సీసీ కెమెరా, సంబంధిత హార్డ్‌డిస్క్ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కానీ రామాంజినమ్మ చెప్పులు అక్కడే ఉండి, ఆమె లేకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

వివాదమేంటి..?

రామాంజినమ్మ రుణం తీసుకుని ఇల్లు కట్టుకుంది. దీంతో పాటు ఆమె ఉద్యోగం కోడలికి ఇప్పించాలని కోడలి తరఫువారు ఒత్తిడి తెచ్చేవారనే ఆరోపణలున్నాయి. లేదా ఇంటిని రాయించాలని బలవంతం చేశారని సమాచారం. ఈ క్రమంలో తన కుటుంబసభ్యుల నుంచే ప్రాణహాని ఉందని రామాంజినమ్మ తన సన్నిహితులతో ఆవేదన వ్యక్తం చేసేదని తెలిసింది. మరి రామాంజినమ్మ అదృశ్యం వెనుక ఈ వివాదం ఉందా..?లేక మరో కోణమేమైనా ఉందా..?అనేది తెలియాల్సి ఉంది.

రూరల్ సీఐ శేఖర్ ఏమంటున్నారంటే..

రామాంజినమ్మ అదృశ్యంపై ఫిర్యాదు చేస్తే ఆమె ఉంటున్న ఇంటిని పరిశీలించాం. బీరువా పగలకొట్టి ఉంది. తాళాలు లేక ఆమే పగులకొట్టిందా లేక ఇంకేమైనా ఉందా అనే కోణంలో పరిశీలించాలి. సీసీ పుటేజీ విషయంలో స్పష్టత లేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

శతాధిక వృద్ధురాలి మృతి



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారప్పగారిపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు లక్ష్మీదేవమ్మ (102) సోమవారం మృతిచెందింది. లక్ష్మీదేవమ్మకు నలుగురు చొప్పున కుమారులు, కుమార్తెలు సంతానం. 14 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. 17 మంది మునిమనవళ్లు, మునిమనవరాళ్లు కూడా ఉన్నారు. చనిపోయే ముందు వరకు కూడా లక్ష్మీదేవమ్మ తన పని తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేదని కుటుంబీకులు, బంధువులు తెలిపారు.

బావిలో పడి బాలుడి మృతి



ప్రసాద్‌నాయక్ (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నపుగుట్ట తండా వద్ద ప్రమాదవశాత్తు బావిలోపడి బాలుడు ప్రసాద్‌నాయక్(16) మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాలాజీనాయక్, లక్ష్మీబాయి దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ప్రసాద్‌నాయక్ పదో తరగతి ఫెయిలై, ఇంటివద్ద ఉండేవాడు. ఆదివారం సాయంత్రం మేకల మేత ఆకుకోసం దగ్గరలో ఉన్న వ్యవసాయ బావి వద్దకెళ్లాడు. అక్కడ ఆకు కోస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈతరాక మునిగి మరణించాడు. చీకటి పడినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. సోమవారం బావివద్ద వెతకగా బాలుడి చెప్పులు కనిపించాయి. బావిలో పడిపోయాడేమోనన్న అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది.. గజ ఈతగాళ్లతో గాలించారు. బాలుడి శవాన్ని బయటకు తీశారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పగలే చోరీ

8 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

నంబులపూలకుంట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లిలోగల దాదెప్ప ఇంట్లో సోమవారం పగలే దొంగలు పడ్డారు. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో ఇంటి తలుపు తాళాలు బద్దలు కొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు పగులకొట్టి అందులోని 8 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరించుకెళ్లినట్లు బాధితుడు ఆవేదన చెందాడు. దాదెప్ప కొత్తగా కొనుగోలు చేసిన గేదె తప్పిపోవడంతో దానిని వెతుక్కుంటూ వెళ్లాడు. అతడి భార్య యశోదమ్మ వ్యవసాయ కూలి పనికెళ్లింది. సాయంత్రం ఆమె పని ముగించుకుని ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా.. బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని చూసి చోరీ అయినట్లు గ్రహించింది. పోలీసులకు సమాచారం అందించారు. జమేదార్ ఓబులేసు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



బీరువా తలుపు తెరిచిన దృశ్యం

అప్రమత్తతతోనే ఆనంద దీపావళి

వెలుగుల పండుగ.. కారాదు చీకటి.. టపాసులు కాల్చేటపుడు జాగ్రత్తలు అవసరం



ఎంజీఎం క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాలు

హిందూపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వెలుగులు చిమ్మే పండుగ దీపావళి సమీపించింది. పండుగ రోజున టపాసులు కాల్చుతూ ఇంటిల్లిపాదీ సందడి చేస్తారు. ఆ ఆనందం వెంటే ప్రమాదాలు కూడా పొంచి ఉంటాయి. దీపావళి ఆనందకేళిగా ఉండాలంటే అప్రమత్తత అవసరం. పండగవేళ నిబంధనలు అమలు చేసి, కనీస జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు. టపాసులు విక్రయించే దుకాణాల ఏర్పాటులోనూ నిబంధనలు పాటించాలి. లేదంటే పెను ప్రమాదాలు తప్పవు.

దుకాణ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

టపాసుల దుకాణాలు పక్కపక్కనే ఏర్పాటు చేస్తే కనీసం 3 మీటర్ల దూరం ఉండాలి. ఎదురెదురుగా ఏర్పాటు చేస్తే 15 మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. దుకాణాల్లో ఐఎస్ఐ గుర్తింపు ఉన్న విద్యుత్ సామగ్రినే వినియోగించాలి. 200లీటర్ల నీటి డ్రమ్ములు అందుబాటులో ఉంచుకోవాలి. ఫైర్ డ్రై కెమికల్ పౌడర్‌ను అందుబాటులో పెట్టుకోవాలి. పరిసరాల్లో వ్యర్థాలు ఉండకూడదు. దుకాణాల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ బాణసంచా పేల్చరాదు. పొగ తాగరాదు. ప్రతి షాపువద్ద తెలుగు, హిందీ, ఇంగ్లి‌ష్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలి. 18 ఏళ్ల నిండని చిన్నారులను దుకాణంలో పనికి ఉంచుకోరాదు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

టపాసులు పేల్చే సమయంలో..

అనుమతి పొందిన వ్యాపారుల వద్దే టపాసులు కొనుగోలు చేయాలి. గుర్తింపు కంపెనీలు తయారుచేసిన టపాసులే తీసుకోవాలి. ఎక్కువ రోజులు ఇళ్లలో నిలువ ఉంచుకోరాదు. పెద్దల సమక్షంలోనే పిల్లలు బాణసంచా కాల్చేలా చూడాలి. చేతుల్లో పట్టుకుని కాల్చకూడదు. సగం కాలిన టపాసులను మళ్లీ కాల్చేందుకు ప్రయత్నించకూడదు. నిప్పంటించినా పేలని వాటి వద్దకు వెళ్లి పరిశీలించకూడదు. ఇది ప్రమాదాలకు దారితీస్తుంది. టపాసులు కాల్చేటపుడు బకెట్‌తో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి. పట్టణాల్లో బహుళ అంతస్తులపై బాణసంచా పేల్చరాదు. రాకెట్లువంటి వాటిని గుడిసెలు, పెట్రోల్‌బంక్‌లు, గడ్డివాములకు దూరంగా కాల్చాలి. అలర్జీ, ఉబ్బసం, శ్వాసకోశ సంబంధిత వ్యాధి బాధితులు.. టపాసులకు దూరంగా ఉండాలి. భారీ విస్ఫోటనం వచ్చే టపాసులు మద్యం తాగి చేతులతో కాల్చడం, చిన్నారులకు ఇవ్వడం వంటివి చేయరాదు. శబ్దకాలుష్యం కలిగించే టపాసులు వాడరాదు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదు. వాటిని సమీకరించి, డస్ట్‌బిన్‌లో వేయాలి.

పేదలు తినే అన్నంపై దుష్ప్రచారమా..?


భోజనం నాణ్యత గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- పాతూరులోని అన్న క్యాంటిన్ తనిఖీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పేదలు తినే అన్నంపైనా దుష్ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక పాతూరులోని అన్న క్యాంటిన్‌ను టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి భోజనం నాణ్యతను పరిశీలించడంతో పాటు పేద ప్రజలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్న క్యాంటీన్లు ఏర్పాటైన తర్వాత ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోందన్నారు. భోజనం నాణ్యతపై ప్రతిఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గత వైసీపీ పాలనలో అన్న క్యాంటీన్లు లేకపోవడంతో బయట హోటళ్లలో అధిక ధరలు వెచ్చించి భోజనం తినలేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తాము అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించామన్నారు. అన్న క్యాంటీన్లపై కొందరు దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. భోజనం నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. నగరంలో త్వరలో మరో రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారామ్, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, సుధాకర్‌నాయుడు, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాండురంగస్వామి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో సోమవారం స్వామి నిజపాద దర్శన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూలవిరాట్లకు ఫలపంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సునీత

ఆత్మకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు క్షేత్రంలో నిర్వహించే కార్తీక మాస ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవిష్కరించారు. దేవస్థానం కమిటీ వారు సోమవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఉత్సవాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి బాబు, అర్చకులు రాముస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ధనత్రయోదశి పూజలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ధనత్రయోదశిని పురస్కరించుకుని హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవాలయంలో మంగళవారం అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా తరలిరావాలని కోరారు.

మెడికల్ కళాశాలలో జనరేటర్ ఏర్పాటు

అనంతపురం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలో జనరేటర్ లేకపోవడంతో కరెంటు పోయినపుడు అధ్యాపకులు, మెడికోలు ఇబ్బందులు పడేవారు. గతంలో ఒకసారి ఎన్ఎంసీ ప్రతినిధుల పరిశీలన సమయంలో కరెంటు పోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు జనరేటర్ కోసం పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డీఎంఈ తదితరులు స్పందించారు. ఏపీఎస్ హెచ్ఐడీసీ ఇంజినీరింగ్ శాఖను ఆదేశించారు. ఇందుకు ఆ ఇంజినీరింగ్ విభాగం స్పందించి రూ. 28లక్షలు విలువ చేసే జనరేటర్‌ను కళాశాలకు మంజూరుచేశారు. ఆ జనరేటర్‌ను సోమవారం న్యాయమూర్తి శివప్రసాద్ యాదవ్ చేతులమీదుగా ప్రారంభించారు. దీంతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, మెడికోలు ఆనందం వ్యక్తంచేశారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇద్దరు మట్కా బీటర్లను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. తారకరామ కొట్టాలలోని వైఎస్సార్ స్కూల్ సమీపంలో మట్కా నిర్వహిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.70,600 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రబాబునాయుడు కొట్టాలలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. అతని నుంచి 25 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

గార్లదిన్నె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనుంపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ మహమ్మద్ గౌస్ సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సభ్యత్వ నమోదులో టాప్‌లో ఉండాలి: ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం నమోదులో అనంతపురం అర్బన్ నియోజకవర్గం టాప్‌లో ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గం పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి అన్ని డివిజన్ల నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మెజార్టీలో అనంతపురం అర్బన్‌లో తనను గెలిపించారన్నారు. ఇప్పుడు అదే ఉత్సాహంతో సభ్యత్వ నమోదును ప్రతి నాయకుడు బాధ్యతగా తీసుకోవాలన్నారు. దేశంలో ఏ పార్టీకి లేనంతగా కార్యకర్తల బలం మన పార్టీకి ఉందన్నారు. ఇదే సమయంలో కార్యకర్తల యోగ క్షేమాల బాధ్య తను మంత్రి నారా లోకేశ్ తీసుకున్నారన్నారు. సభ్యత్వం చేయించుకుంటే రూ.5 లక్షల బీమా సదుపాయం ఉంటుందన్నారు. అన్ని విషయాలు ప్రజలకు వివరించి సభ్యత్వం నమోదును మరింత వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, తలారి ఆదినారాయణ, రాయల్ మురళి, సుధాకర్‌నాయుడు, రాజారావు, స్వప్న, సంగా తేజస్విని, కంతాదేవి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో కాగిత రహిత పాలన

- ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో కాగిత రహిత పాలనను అమలు చేయనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. సోమవారం ఐసీఐసీ బ్యాంకు ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ.. ఐఐటీ ఢిల్లీతో కలిసి కేంద్ర ప్రభుత్వ ఇ-సమర్థ్ అనే సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేసిందన్నారు. దీన్ని అమలుచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా పేమెంట్ గేట్‌వే వంటి అంశాల్లో సహాయ సహకారాలందించేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఓఎస్‌డీటీ టూ వీసీ దేవన్నతోపాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో పలువురికి నూతన బాధ్యతలు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో పలువురు ప్రొఫెసర్లకు నూతన బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు ఆదేశాల మేరకు సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. అకడమిక్ అండ్ ఆడిట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ దుర్గాప్రసాద్, ఐఆర్ అండ్ పీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ కిరణ్మయి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ప్రొఫెసర్ సురేష్ బాబు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ నారాయణరెడ్డి, ఎన్ఐఆర్ఎఫ్ నోడల్ ఆఫీసర్‌గా ప్రొఫెసర్ దిలీప్‌కుమార్, ఎంబీఏ విభాగాధిపతిగా ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా డాక్టర్ కళ్యాణకుమార్, పులివెందుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ బాధ్యతలు చేపట్టనున్నారు.

అనంత చేరిన అయ్యప్ప భక్తుల పాదయాత్ర


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భిక్ష చేస్తున్న అయ్యప్ప భక్తులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనార్థం అయ్యప్ప దీక్షధారులు హైదరాబాదు నుంచి చేపట్టిన పాదయాత్ర అనంతపురం చేరుకుంది. గురుస్వామి జగన్‌రెడ్డిస్వామి శిష్య బృందం దాదాపు 180 మంది ఈనెల 15న హైదరాబాద్ నుంచి బయలు దేరారు. జెడ్చెర్ల, కర్నూలు, డోన్, గుత్తి మీదుగా సోమ వారం అనంతపురంలోని పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా స్రవంతి గురుస్వామి కుర్లపల్లి రంగాచారి నేతృత్వంలో ఆలయ ఆవరణలో అయ్యప్ప పూజ నిర్వహించి, భజనలు చేశారు. అనంతరం పాదయాత్ర బృందానికి భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం ఆ బృందం పాదయాత్రగా రాత్రికి రాప్తాడు చేరింది. డిసెంబరు 4న శబరిమలైలో దర్శనం చేసుకోవాలనే లక్ష్యంతో సాగుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సేవా స్రవంతి సభ్యులు గోపాల్, కేశవ, ప్రకాష్, శ్రీధర్, రమణ, కృష్ణమాచారి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నవంబరులో ఏఐఎస్ఎఫ్ మహాసభలు

- 27 నుంచి ప్రారంభం: సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

అనంతపురం విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను వచ్చే నెల 27వ తేదీ నుంచి విజయనగరంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం జిల్లా నాయకులతో కలసి ఆయన రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన ఏకైన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ప్రస్తుతం దేశంలో విద్యా ప్రైవేటీ కరణ, కాషాయీకరణ జరుగుతోందన్నారు. అంతేకాకుండా బీజేపీ తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం వల్ల రాష్ట్రంలో అనేక విద్యా సంస్థలు మూతపడ్డాయని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. ఉన్నత విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రమణయ్య, వెంకట్ నాయక్, మహేంద్ర, మంజునాథ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి సన్మానం


విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ కోర్సుల ప్రవేశ పరీక్షలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి విజయలక్ష్మిని సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎంఎస్ఎఫ్ సంయుక్తాధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు యల్లన్న మాట్లాడుతూ... బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామానికి చెందిన విజయలక్ష్మి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఆమెకు తోడుగా ఉంటామన్నారు. నాయకులు రామాంజినేయులు, ఎర్రిస్వామి, శిద్దు, శివ, మారుతి, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

భవనాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టాలి

- ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీకి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నూతన భవనాలకు స్వాతంత్ర్య సమర యోధుల పేర్లను పెట్టాలని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనితను ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. వారు సోమవారం వీసీని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీల్లో రాజకీయ నాయకులు విగ్రహాలు నెలకొల్పి, కొత్త భవనాలకు వారి పేర్లు పెట్టారన్నారు. ఉద్యమాలు చేయడంతో విరమించుకున్నారని తెలిపారు. ఎస్కేయూలో నిర్మిస్తున్న భవనాలకు ఐదుకల్లు సదాశివం వంటి సమరయోధుల పేర్లు పెట్టాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో నాయకులు కుళ్లాయిస్వామి, రమణయ్య, వెంకట్‌నాయక్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యం


ముఖ్యఅతిథులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని జయిస్తే.. విజయం విద్యార్థులను వరిస్తుందని జేఎన్‌టీయూ ఆంగ్ల ఆచార్యులు కేబీ చిత్ర అన్నారు. మండలంలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో 'మానవతా విలువలు-ఒత్తిడి నియంత్రణ' అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాపును సోమవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ ఆంగ్ల ఆచార్యులు కేబీ చిత్ర, బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థి దశలో మంచి ఆలోచనలు, విలువలు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్న పోటీతత్వాన్ని గుర్తించి ఉన్నతంగా విద్యాభ్యాసం చేయాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ హెచ్అండ్ఎస్ విభాగాధిపతులు లక్ష్మీనరసప్ప, కిరణ్‌కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంఘంలో 50మంది సభ్యులు ఉండాలి

అనంతపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటయ్యే చేనేత సహకార సంఘాల్లో 50మంది సభ్యులుండాలని చేనేత, జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు పేర్కొన్నారు. మండలంలోని సిండికేట్ నగర్‌లో సోమవారం శ్రీరామనంద చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావు, డీఓ బసవరాజు, ఏడీఓలు మురళి, నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ... ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉచితం విద్యుత్‌తో పాటు పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరసింహులు, మంజునాథ, ఎర్రిస్వామి, చౌడప్ప, కృష్ణవేణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

295 ఫిర్యాదులు


కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్ఓ మలోల

అనంతపురం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం జిల్లా స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది. గుంతకల్‌లో రెవెన్యూ స్థాయి గ్రీవెన్స్‌కు కలెక్టరు, జేసీతో పాటు ఇతర అన్నిశాఖల ఉన్నతాధికారులు వెళ్లగా, జిల్లాస్థాయి గ్రీవెన్స్ కు ఆయా శాఖల ద్వితీయస్థాయి అధికారులు హాజరయ్యారు. నూతన డీఆర్ఓ మలోల ఆధర్యంలో గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. మొత్తం 295 ఫిర్యాదులు వచ్చినట్లు డీఆర్ఓ తెలిపారు. కలెక్టరును, జిల్లా స్థాయి ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించుకోవాలని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తీవ్ర నిరాశకు గురయ్యారు. జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులు లేకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురై తమ అర్జీలను డీఆర్ఓకు అందజేసి వెళ్తున్నట్లు కనిపించింది.

అంతర కళాశాలల కబడ్డీ జట్టు ఎంపిక


ఎంపికైన కబడ్డీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ అంతర్ కళాశాలల కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్టును శాప్ కబడ్డీ కోచ్ అనీల్ కుమార్ సోమవారం ప్రకటించారు. జట్టులో యుగంధర్, రాజశేఖర్, లోకేష్ సాయి కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, వంశీ, ఎం మధు, శివ, శ్రీనివాసులు, మోహన్ కైశిక్, ఆనంద్, పి మధు ఉన్నారు. ఎంపికైన జట్టు బుధవారం నుంచి చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే జాతీయ అంతర కళాశాలల కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఎంపికైన జట్టును ఎస్కే యూనివర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, క్రీడా కార్యదర్శి జెస్సీ అభినందించారు.

ప్రీ పరేడ్‌కు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి తదితరులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రీపరేడ్ క్యాంప్‌నకు స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంతోష్ నాయక్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వైస్ ప్రిన్సిపాల్ శశాం కమౌళి తన కార్యాయంలో సంతోష్ నాయక్‌ను అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్ఎస్ఎస్, పరేడ్ వంటి క్యాంపుల్లో క్రమం తప్పకుండా పాల్గొంటూ జిల్లా ఖ్యాతిని చాటుతున్నారని కొనియాడారు. పీఓ లు విష్ణుప్రియ, సోమశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో పెరవలి విద్యార్థి ప్రతిభ


విద్యార్థి లోకేశ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం సోమశేఖర్

శింగనమల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎం లోకేశ్ ప్రతిభ చూపాడు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలురు విభాగంలో పెరవలి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువు తున్న లోకేశ్ హిందూపురంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. లోకేశ్‌ను పాఠశాల హెచ్ఎం సోమశేఖర్, పీడీ నరసింహారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు శివయ్య తదితరులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

గురి తప్పని దీక్ష

ఆసక్తిగా ఆర్చరీ పోటీలు


పేర్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విలు విద్య క్రీడాకారులు తమ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఎస్‌జీఎఫ్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో సోమవారం స్థానిక విద్యారణ్య పాఠశాల ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 250మంది బాలబాలికలు హాజరయ్యారు. ఒకే సమయంలో సుమారు 10-15మంది క్రీడాకారులు విల్లు ఎక్కి పెట్టి బాణంతో కొట్టడంతో పోటీలు ఆసక్తిగా జరిగాయి. జిల్లాస్థాయిలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.


విల్లు ఎక్కి పెట్టు.. పతకం పట్టు అంటున్న ఆర్చర్లు

బాణాలను తీస్తున్న ఆర్చర్లు



గుత్తికోట సందర్శన


కమిటీ సభ్యులకు గుత్తికోట సంరక్షణ సమితి స్వాగతం

గుత్తి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చారిత్రాత్మకంగా ప్రసిద్ధి పొందిన గుత్తి కోటను కేంద్ర పార్లమెంట్ పరిశోధన కమిటీ సభ్యులు ఎథిన్‌దీపక్, దివీతి సోమవారం సందర్శించారు. అప్పటి కలెక్టర్ సర్‌థామస్ మన్రో సమాధిని పరిశీలించారు. అనంతరం కోటపై పురాతన గుర్రపు శాల, మురారి రావు గద్దె, ఖిల్లా, చీకటి గదులు, బావులను, వివిధ కట్టడాలను పరిశీలించారు. కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, గైడ్ రమేష్ వారికి స్వాగతం పలికారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచనలతో వారు గుత్తి కోటను సందర్శించారని అన్నారు. కోట అభివృద్ధి కోసం ప్రణాళికను సిద్ధం చేయడానికి వారు రావడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు సుధాకర్, బాబాసాహెబ్, శేఖర్, పురావస్తు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

బ్రహ్మసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగేపల్లి గ్రామంలో సోమవారం వాల్మీకులు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలోని వీధుల గుండా ఊరేగించారు. మహిళలు, కలశాలను ఎత్తుకుని, డోలు వాయిద్యాల నడుమ వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. వాల్మీకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలో మహర్షి వాల్మీకి జయంతిని వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అన్నదానం చేపట్టారు.

టీడీపీ కార్యకర్త మృతి

పుట్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కేశవనాయుడు (62) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. వారం రోజులక్రితం తాడిపత్రికి బైక్‌లో వెళుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో కుటుంబసభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి భార్య అలివేలమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జుంజురంపల్లిలో పంటకోత ప్రయోగాలు

రాయదుర్గం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లి రెవెన్యూ గ్రామంలో వేరుశనగ పొలాల్లో సోమవారం పంటకోత ప్రయోగాలు చేశారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) తనిఖీ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో ఏఈఓ ఆంజినేయులు పంటకోత ప్రయోగాలు జరిపారు. గ్రామానికి చెందిన గిడప్ప పొలంలో 2,100 గ్రాములు, లక్ష్మీనాయక్ పొలంలో 1,730 గ్రాములు దిగుబడి వచ్చిందని తెలిపారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగరాజు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ కాట్రాజు, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కంపెనీ మేనేజర్

విడపనకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం బయార్ కంపెనీ వారు వివిధ గ్రామాల రైతులకు మిరప పంటలకు సోకే తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ రాయలసీమ జోనల్ మేనేజర్ చేతన్ మాట్లాడుతూ .. మిరప పంటలకు సోకే వివిధ రకాల తెగుళ్లను నివారించేందుకు ముమెంటో ఓడీ, అసర్ఫ్, వయాగో, జంప్ ఒబెరాన్, నెటివో, లూనా ఎక్స్‌ప్రెస్ వంటి మందులను పిచికారీ చేయాలని సూచించారు. పలువురు రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గుత్తికి వెళ్లే రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలకేంద్రానికే చెందిన బాలుడు సుభాష్ రోడ్డును దాటుతుండగా.. బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

మూడేళ్లుగా పిల్లర్లకే పరిమితం

- నిధులున్నా నిర్మాణానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం
- అద్దె భవనంలో కేంద్రం నిర్వహణ


పిల్లర్లు వద్దే ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

బెళుగుప్ప, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 4వ అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు గత మూడేళ్లుగా పిల్లర్లకే పరిమితమయ్యాయి. చేసేదిలేక ఆ అంగన్‌వాడీ కేంద్రం అద్దెభవనంలో కొనసాగుతోంది. ఈ భవనం నిర్మించడానికి నాడు నేడు పథకం కింద 2022వ సంవత్సరంలో రూ. 4.41 లక్షల నిధులు మంజూరయ్యాయి. అందులో రూ. 3.49 లక్షలకు బిల్లు చేశారు. అయితే భవన నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. నిధులు డ్రా అయ్యాయే కానీ పనులు మాత్రం జరగలేదు. భవనం నిర్మించకుండానే నిధులు దుర్వినియోగమయ్యాయని, పిల్లర్ల వరకు మాత్రమే నిర్మించి వదిలేశారని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఇక్కడ సామూహిక మరుగుదొడ్డి ఉండేదని, దాన్ని కూల్చి అంగన్‌వాడీ భవనం నిర్మాణపు పనులు చేపట్టారని అంటున్నారు. చుట్టూ పిల్లర్లు వేసి చేతులు దులుపుకున్నారని వాపోతున్నారు. సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం అద్దెభవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోందని, అక్కడ సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. ఉన్నతాధికారులు విచారిస్తే నిధుల అక్రమాల భాగోతం బయటపడుతుందని వారు పేర్కొంటున్నారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాము

గతంలో ఇక్కడ పనిచేసిన సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. తాను కొత్తగా వచ్చాను. నిర్మాణపు పనులు పూర్తి చేసేందుకు నిధులకు మళ్లీ ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సురేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ

శిథిలావస్థ భవనాన్ని లీజుకు ఇవ్వరాదు

- కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన భవనాలను ప్రైవేటు కళాశాలలకు లీజుకు ఇవ్వరాదని టీడీపీ కౌన్సిలర్లు ప్రశాంతి, బళ్లారి జ్యోతి, పద్మజ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప అధ్యక్షన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో పట్టణంలోని జేఆర్‌ఎస్ కాలనీలో రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలకు సంబంధించిన భవనాన్ని విద్యారణ్య జూనియర్ కళాశాలకు ఇచ్చిన లీజు ముగిసింది. అయితే ఇప్పుడు లీజును రెన్యూవల్ చేయడానికి వచ్చిన అంశాన్ని కౌన్సిలర్లు తిరస్కరించారు. రెన్యూవల్ చేయకూడదని కోరారు. అనంతరం కౌన్సిలర్ అజయ్ మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్ కిందిభాగంలోని గదులు తక్కువ రేట్లకు బాడుగలు ఇచ్చి పైభాగంలోని గదుల అద్దె అధికంగా ఉండడంతో బాడుగ తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్ మూడేళ్ల కాలపరిమితి పూర్తి అయింది కాబట్టి బహిరంగ వేలం వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సాధ్యమైనంత వరకు షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన 12 గదులను తొలగించి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లడుతూ ఒట్లకుంట పరిసర ప్రాంతమంతా అపరిశుభ్రత తాండిస్తుండడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉరవకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సమీపంలోని పాల్తూరు క్రాస్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. నార్పలకు చెందిన నాగార్జున, బుక్కరాయసముద్రం మండలం రేగడి కొత్తూరుకు చెందిన ఈశ్వర్, ఓబేంద్రతో కలిసి బైక్‌లో బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు బయలు దేరాడు. బూదగవి సమీపంలోకి రాగానే బళ్లారి వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వర్, ఓబేంద్రకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

పవర్‌గ్రిడ్‌పై కలెక్టర్ సమీక్ష

గుంతకల్లు టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఎన్‌హెచ్-544డీ పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో ప్రాజెక్టులపై కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్షించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అలాగే డ్వామా పీడీ, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష జరిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


రామ్మోహన్ (ఫైల్)

కళ్యాణదుర్గం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటమ్మ థియేటర్ సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రామ్మోహన్ (45) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రామ్మోహన్ ఉదయం స్నానం చేస్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య నాగమణి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈయన బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామ్మోహన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాజీ సర్పంచ్ మృతికి 'ఉన్నం' నివాళి


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం తదితరులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దురదకుంటలో మాజీ సర్పంచ్ సరస్వతమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, సర్పంచ్ గరికపాటి అరుణసురేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్, టీడీపీ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బొమ్మనహాళ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ అన్నారు. మండల కేంద్రంలోని వడ్డే క్యాంప్ కాలనీలో సోమవారం సర్పంచ్ వన్నమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణనికి భూమి పూజ జరిగింది. కార్యక్రమానికి భరత్ ముఖ్యఅతిథిగా వచ్చేసి శిలఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మండల కన్వీనర్ బలరాంరెడ్డి, క్లస్టర్ కన్వీనర్ కేశవరెడ్డి, మాజీ జడ్పీటీసీ వాణిజగన్నాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ షణ్ముఖయ్య, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన

యాడికి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కోనుప్పలపాడులో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న చెక్‌డ్యాం నిర్మాణానికి సోమవారం టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్డీటీ ఆధ్వర్యంలో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. చెక్‌డ్యాం ద్వారా వర్షపునీటిని ఒడిసి పట్టుకోవచ్చునని తెలిపారు. ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ మురళీధర్, సెక్టార్ టీం లీడర్ నరసింహులు, ఇంజనీర్ బాలాజీనాయుడు, సర్పంచు రామలక్షుమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

యాడికి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం యాడికిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఈరన్న మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని తెలిపారు. ఈ శిబిరానికి 125మంది రక్తదాతలు వచ్చి రక్తదానం చేశారని తెలిపారు. క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు పరిమి చరణ్, తాడిపత్రి సేవా బ్లడ్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● మున్సిపల్ కార్మికుల ధర్నా

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇంటింటా చెత్త సేకరణకు పనిముట్లు ఇవ్వడం లేదని, ఇలా అయితే చెత్త సేకరణ ఏవిధంగా చేపట్టాలంటూ మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. ఇంటింటా చెత్త సేకరణ చేయడానికి కావాల్సిన చెత్త బుట్టలను మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులు 62 మంది ఉండగా.. కేవలం 48 మంది మాత్రమే పని చేస్తున్నారన్నారు. మిగతా 14 మంది పనులు చేయడం లేదన్నారు. వెంటనే ఆ 14 మందిని పారిశుధ్య పనులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి వెంటనే ఉద్యోగం కల్పించాలని, రూ.రెండు లక్షలు పరిహారం కూడా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు వెంకటేష్, తిమ్మప్ప, నటరాజు, రమణ, అలివేలమ్మ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు



గుత్తిలో..

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ సంఘీభావం తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు అవసరమైన పనిముట్లు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుల కుటుంబసభ్యులకు ఉపాధి, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు మహేష్, ఇంజనీరింగ్ అధ్యక్షుడు మురళి, నాయకులు సుంకన్న, ఈశ్వరయ్య, రాజశేఖర్, నరసింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఉరవకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో ఈబీదేవి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. సమయ పాలన పాటించాలని, గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు పావని, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు గుంతకల్లు విద్యార్థి



టీ. మధు

గుంతకల్లుటౌన్, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థి టీ. మధు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య సోమవారం తెలిపారు. ఇటీవల యూనివర్శిటీ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో మధు ప్రతిభ కనబరిచాడన్నారు. దీంతో ఈనెల 30 నుంచి నవంబరు 3వ తేదీ వరకు తమిళనాడులోని కట్టంకులత్తూరులో జరిగే సౌత్ జోన్‌కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌కో ఏడీఈగా భాస్కర్

ఉరవకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉరవకొండ సబ్‌డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈగా భాస్కర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రవిచంద్ర కడప జిల్లా బద్వేల్‌కు బదిలీ అయ్యారు. దీంతో ఆ స్థానంలోకి నెల్లూరు నుంచి భాస్కర్ పదోన్నతిపై వచ్చారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

గుత్తిరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణ పనుల్ని డ్వామా పీడీ సలీమ్ బాషా సోమవారం పరిశీలించారు. అలాగే ఉపాధి హామీకింద చేపడుతున్న పశువుల షెడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రూ. 21.30 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 6.90 లక్షల వ్యయంతో పశువుల షెడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీడీ విజయకుమార్, ఏపీఓ మద్దిలేటి, ఈసీ ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ లింగమయ్య, టెక్నికల్ అసిస్టెంట్ రత్న, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

మీటర్లు బిగించడాన్ని రద్దు చేయాలి

రాయదుర్గంరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లకు, పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని రద్దు చేయాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సోమవారం నాయకులు, కార్యకర్తలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్‌వినియోగదారులపై ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 6072 కోట్ల పెనుభారాన్ని మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం ఈ మేరకు విద్యుత్‌శాఖ ఏడీఏకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్, ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు తిప్పేస్వామి, నరసింహులు, సీపీఐరాయదుర్గం మండల కార్యదర్శి దుర్గన్న, సీపీఐ పట్టణ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల బోర్డుల ఏర్పాటు

బొమ్మనహాళ్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగ పడే ముఖ్యమైన 100 రెవెన్యూ సేవల వివరాలకు సంబంధించిన బోర్డులను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగమైన సేవల వివరాలను ఆ బోర్డుల్లో పొందుపరిచామన్నారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

గుత్తి,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన, కమిషనర్ జబ్బర్ మీయా సమక్షంలో జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. తమకు తెలియకుండా తమ వార్డుల్లో అభివృద్ధిపనులు చేపడుతున్నారని, ప్రొటోకాల్ పాటించడంలేదంటూ వైసీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. అజెండా చదవకముందే కౌన్సిలర్లు సమస్యలను చెప్పుకొచ్చారు. 3, 4వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టారని, తమకు ఎందుకు తెలపడం లేదంటూ ఆయా కౌన్సిలర్లు, వైస్‌చైర్‌పర్సన్ వరలక్ష్మి అధికారులతో వాగ్వాదానికి దిగారు. వార్డులలో పనులు చేసేటప్పుడు ఆ వార్డు కౌన్సిలర్లకు ఎందుకు చెప్పడం లేదంటూ మండిపడ్డారు. అభివృద్ధిని తాము అడ్డుకోవడం లేదని, ప్రొటోకాల్ పాటించాలని అడుగుతున్నామని చెప్పారు. కౌన్సిలర్లతో పనిలేనప్పుడు ఈ సమావేశం ఎందుకంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీతో సహా వైస్‌చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కూడేరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కరుట్లపల్లికి చెందిన నరేష్ (34) ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్‌కు కొర్రకోడు గ్రామానికి చెందిన నాగలక్ష్మితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా భార్య ప్రవర్తన సక్రమంగా లేదని నరేష్ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన తీవ్ర మనస్థాపం చెందిన అతను రాత్రి సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పుట్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలో 9మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3470 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అందిన సమాచారం మేరకు సోమవారం సిబ్బందితో దాడులు చేసి అరెస్టు చేశామన్నారు.

కుందుర్పి: కొలిమిపాలెం గ్రామ సమీపంలోని పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ నీలకంఠేశ్వర, ఎస్ఐ నాగేష్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని, అనంతరం వారి వద్ద నుంచి రూ. 6700 నగదును, ఐదు సెల్ ఫోన్లను, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

అర్హులైన రైతులకు పట్టాలివ్వాలి

కూడేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కూడేరు పొలంలోని 535 సర్వేనంబర్‌లో భూమిని సాగు చేస్తున్న అర్హులైన రైతులకు వెంటనే పట్టాలివ్వాలని సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఈ మేరకు నిరసన చేశారు. తర్వాత వినతిపత్రాన్ని డీటీ సూర్యప్రతాప్‌కు అందించారు. సీపీఎం జిల్లా నాయకుడు కృష్ణమూరి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. పట్టణంలోని టీడీడీ కల్యాణమండపంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ వినోద్‌కుమార్ తహసీల్దార్ రమాదేవికి ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందాలంటే 39రకాల ప్రమాణాలు అవసరమన్నారు. ఐఎస్ఓ ప్రతినిధులు వచ్చి ఈ కార్యాలయానికి అన్ని ప్రమాణాలు ఉన్నాయని గుర్తించారన్నారు. హైదరాబాద్‌లోని గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తహసీల్దారు కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను ప్రకటించినట్లు తెలిపారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలి

ఉరవకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..సామాజిక తనిఖీల ద్వారా ఉపాధి పనుల్లో రూ.78లక్షల అవినీతి జరిగినట్లు బహిర్గతమైందన్నారు. అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, తూతూ మంత్రంగా రికవరీకి ఆదేశించారన్నారు. నిధులు కాజేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపించాలన్నారు. అనంతరం ఎంపీడీవో రవిచంద్ర, ఏపీవో విమలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ క్రమంలో ఆ అధికారులతో నాయకులు వాగ్వాదానికి దిగారు. సామాజిక తనిఖీలు నామమాత్రంగా నిర్వహించడమేమిటని నిలదీశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, మురళి, శీనప్ప, కాంగ్రెస్ నాయకులు శీన, ఓబులేశు, బ్యాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమాల నిగ్గు తేల్చాలి..

● విచారణాధికారిని కోరిన పాఠశాలల నూతన చైర్మెన్లు

● గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో నాడు-నేడు పనుల అక్రమాలపై విచారణ



విచారణ అధికారితో సమావేశమైన పాఠశాలల చైర్మెన్లు తదితరులు

కూడేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన నాడు-నేడు పనుల్లో అక్రమాలపై కలెక్టర్ కన్నెర్ర చేశారు. నాడు- నేడు పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై విచారణ సరిగా జరగకపోవడంతో ఈ నెల 26వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో విచారణ తుస్సు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన కలెక్టర్ వినోద్ కుమార్, గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులను విచారణ అధికారిగా నియమించారు. దీంతో సోమవారం మండలంలోని పలు పాఠశాలల మాజీ చైర్మెన్లు, నూతన చైర్మెన్లతో పాటు హెచ్‌ఎంలు గుంతకల్లుకు వెళ్లి విచారణాధికారితో సమావేశమయ్యారు. కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ బోయరాము, ఎస్సీ కాలనీకి చెందిన పాఠశాల చైర్మెన్ రాము, కమ్మూరు పాఠశాల చైర్మెన్ దేవేంద్ర అధికారితో మాట్లాడారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి అక్రమార్కుల భరతం పట్టాలని కోరారు. కాగా హెచ్‌ఎంలు పాఠశాల నూతన చైర్మన్లకు కాకుండా మాజీ చైర్మన్లకు మాత్రమే గుంతకల్లుకు రావాలని సమాచారం ఇవ్వడం వెనుక పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలపై ఆర్డీవో విచారణకు పాత, కొత్త చైర్మెన్లకు హెచ్‌ఎంలు సమాచారం ఇవ్వాల్సి ఉండగా.. కేవలం వైసీపీ పాలనలో కొనసాగిన చైర్మెన్లకు మాత్రమే సమాచారం ఇవ్వడం వెనుక అంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నూతన చైర్మెన్లు అధికారిని కోరారు.

కేబుల్ నిర్వాహకులతో జేసీపీఆర్ సమావేశం

తాడిపత్రి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కేబుల్ నిర్వాహకులు, ఆటోడ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేబుల్ నిర్వాహకులు ప్రభుత్వం మారినప్పుడల్లా సమస్యలను సృష్టించి వ్యాపారంగా మారుస్తుండడం బాధాకరమన్నారు. ప్రజలకు అనుగుణంగా కేబుల్ నిర్వహించాలే తప్ప రాజకీయాలు చేయడం తగదన్నారు. అందువలన ప్రజలపక్షాన అధునాతనమైన కేబుల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆటో యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతూ.. వాహనాలకు ఇన్సురెన్స్, డ్రైవర్లకు లైసెన్సు తప్పక కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులను జాగ్రత్తగా గమ్యానికి చేర్చాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం

కణేకల్లు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఎంపీపీ లీలావతి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జడ్పీటీసీ పద్మావతి, ఎంపీడీఓ శ్రీనివాసులుతో పాటు పలువురు శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖలపై సమీక్షలు జరుగగా ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పారు. ఈఓఆర్డీ చంద్రమౌళి, ఏఓ శ్రావణ్‌కుమార్, ఎంఈఓ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీ.హీరేహాళ్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించకుండా కఠినచర్యలు చేపట్టాలని సీఐ వెంకటరమణ సిబ్బందికి ఆదేశించారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బెల్ట్‌షాపుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించిందన్నారు. నిత్యం గ్రామాలలో పర్యటించి బెల్ట్‌షాపుల నిర్వహణను కట్టడి చేయాలని సూచించారు.